క్లుప్తంగా

నేడు పోలేరమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు

కొత్తపట్నం: మండలంలోని మడనూరు– గమ్మ ళ్లపాలెంలో నేటి నుంచి పోలేరమ్మ తల్లి నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు జరగనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 18వ తేదీ విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, యజ్ఞశాల, ఆలయ శుద్ధి, 19వ తేది అమ్మవారి గ్రామోత్సవం, నిత్యపూజ, హోమాలు, క్షీరాధివాసం, 20వ తేదీ కలశప్రతిష్ఠ, కుష్మాండబలి, మహాకుంభాభిషేకం అన్నసంతర్పణ జరుగునని నిర్వాహకులు ప్రకటనలో తెలిపారు.

రేపు శ్రీగిరిలో వసంతోత్సవం

ఒంగోలు మెట్రో: నగరంలోని కొండమీద వెలసిన శ్రీగిరి వెంకటేశ్వరస్వామికి ఈనెల 19వ తేదీ శనివారం వసంతోత్సవం నిర్వహిస్తున్నట్లు శ్రీగిరి దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం శ్రీవారికి సహస్ర నామార్చన, విశేష స్నపన తిరుమంజనం, సాయంత్రం వసంతోత్సవం, ఊంజల సేవ, బొల్లాపల్లి వెంకట ఫణిదీప్తి బృందంచే గాత్ర కచేరీ ఉంటుందన్నారు. వసంతోత్సవంలో పాల్గొనాలనుకునే భక్తులు దేవస్థాన కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 92464 65282 నంబర్‌లో సంప్రదించాలని ఆమె ప్రకటనలో కోరారు.

పోషణ్ పక్వాడాపై అవగాహన

సంతనూతలపాడు: మండలం గురువారెడ్డిపాలెం గ్రామంలో గురువారం నాడు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు పోషణ పక్వాడాపై అవగాహన కల్పించారు. తక్కువ ఖర్చుతో తయారయ్యే నాణ్యమైన పోషక పదార్థాలు తీసుకుంటే ఆరోగ్య సంరక్షణ కలుగునని అంగన్వాడీ టీచర్ కే. రంగమ్మ, ఏఎన్‌ఎం అంజనీ దేవిలు కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు రమణమ్మ, ఆర్ నాగలక్ష్మి, కే.రంగమ్మ, మహిళా పోలీస్ ప్రశాంతి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌ను సన్మానిస్తున్న గ్రేడ్‌-6 పంచాయతీ కార్యదర్శులు

ఒంగోలు సబర్బన్: ప్రకాశం జిల్లా పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్‌-6 సంఘం నాయకులు, సభ్యులు గురువారం జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాను కలిసి కార్యదర్శుల సమస్యలు విన్నవించారు. సీనియార్టీ లిస్ట్‌లో గ్రేస్ మార్కులు కలిపాక క్వాలిఫై అయినవారిని గుర్తించాలని కోరారు. సీనియారిటీలో జరిగిన తప్పులను సరిచేయించాలని కలెక్టర్‌ను కోరారు. అందుకు స్పందించిన కలెక్టర్ సంబధిత అధికారులకు తగిన ఆదేశాలు ఇస్తానని హామీ ఇచ్చారు.

రాహుల్‌ని చూసి భయపడుతున్న మోదీ

ఒంగోలు వన్‌టౌన్: రాహుల్‌ను చూసి ప్రధాని నరేంద్ర మోదీ భయపడుతున్నాడని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్కే సైదా విమర్శించారు. ఒంగోలులోని బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయంలో పార్టీ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సైదా మాట్లాడుతూ నేషనల్ హెరాల్డ్ కేసులో అక్రమంగా సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై చార్జిషీట్ దాఖలు చేశారన్నారు. అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ కంపెనీ అప్పుల్లో కూరుకుపోయినప్పుడు 2002 నుంచి 2011 మధ్య కాలంలో పార్టీ రూ.90 కోట్లను సహాయం చేసిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు టీ నాగలక్ష్మి, కె వెంకట కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దాతల సాయం అభినందనీయం



నూతన వస్త్రాలు అందిస్తున్న నిర్వాహకులు

ఒంగోలుమెట్రో: దాతల సాయం అభినందనీయమని వక్తలు పేర్కొన్నారు. గురువారం నగరంలోని కర్నూలు రోడ్‌లో రావి అంజయ్య బజార్ గుడ్‌న్యూస్ మినిస్ట్రీ అంధుల పాఠశాలకు దాత ఫాదర్ డీఎస్ పాల్ ఆర్థిక సహకారంతో 25 మంచాలు, వాటర్ ప్యూరిఫయర్ నూతన వస్త్రాలు అందించారు. కార్యక్రమంలో మానవతా సేవా సంస్థ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు మాట్లాడుతూ అంధులైన విద్యార్థులకు దాతలు అండగా నిలబడటం సంతోషమన్నారు. కార్యక్రమంలో బీసీ సమైక్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు, సినీ నటుడు దన్నారపు మస్తాన్‌రావు, సంస్థ నిర్వాహకుడు స్వర్ణ మోహన్‌రావు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల ఎంపిక

చీమకుర్తి రూరల్: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా పార్టీ అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, సంతనూతలపాడు ఇన్‌చార్జ్ మేరుగు నాగార్జున కూర్పుతో మండల నూతన అనుబంధ విభాగాల అధ్యక్షుల ఎంపిక చేసినట్లు మండల పార్టీ అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు తెలిపారు. యూత్‌వింగ్ అధ్యక్షుడిగా సుడిదెల వెంగారెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలిగా జడ్రాజుపల్లి మరియమ్మ, రైతు విభాగం అధ్యక్షుడిగా నల్లూరి రామచంద్రరావు, బీసీ సెల్ విభాగం అధ్యడిగా గంగిరేకుల వెంకటరావు, ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షుడిగా గండి రోశయ్య, మైనారిటీ సెల్ విభాగం అధ్యక్షుడిగా ఎస్‌కె రఫి, స్టూడెంట్ వింగ్ అధ్యక్షుడిగా సాధినేని వెంకటరావు, వైఎస్సార్ ట్రేడింగ్ యూనియన్ అధ్యక్షుడిగా కుంచాల రాంబాబు, గ్రీవెన్స్ సెల్ విభాగం అధ్యక్షుడిగా కత్తి రమణారెడ్డి, పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడిగా మేకల వీరారెడ్డి, వలంటరీ విభాగం అధ్యక్షుడిగా సోము చౌడారెడ్డి, అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలిగా సొంగా శంకర గోవిందమ్మ, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా గోపిరెడ్డి వెంకారెడ్డి, కల్చరల్ విభాగం అధ్యక్షుడిగా గొల్లా సుబ్బారావు, ఆర్‌టీఐ విభాగం అధ్యక్షుడిగా బొంతా సంతోష్ కుమార్, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా ఉప్పలపాటి వెంకటరావు, క్రిస్టియన్ మైనారిటి సెల్ విభాగం అధ్యక్షుడిగా తిమోతి, సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడిగా చిన్నపురెడ్డి రామిరెడ్డి, బూత్ కమిటీ విభాగం అధ్యక్షుడిగా సుడిదెల సుబ్బరామిరెడ్డి, ఎస్టీ సెల్ పవన్‌కుమార్, పబ్లిసిటీ విభాగం అధ్యక్షుడిగా కె సత్యనారాయణలను నియమించినట్లు ఆయన తెలిపారు.

నాగులుప్పలపాడు మండలం..

నాగులుప్పలపాడు: పార్టీలో మండల అనుబంధ కమిటీల అధ్యక్షులను ఎంపిక చేసినట్లు పార్టీ మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ తెలిపారు. పార్టీ యువజన విభాగం ఇమ్మిశెట్టి బాలకృష్ణ, మహిళా విభాగం పోకూరి లక్ష్మి, రైతు విభాగం తగిరిశ సుబ్బారావు, బీసీ సెల్ పాదర్తి శివ, ఎస్సీ సెల్ పొట్లేటి అశోక్, మైనార్టీ సెల్ రజాక్ బేగ్, విద్యార్థి విభాగం ఈమని భాస్కర రెడ్డి, గ్రీవెన్స్ సెల్ పీ రామస్వామి, పంచాయతీ రాజ్ విభాగం కాట్రగడ్డ శ్రీనివాసరావు, వలంటీర్ల విభాగం చిన్నంగారి వరుణ్, అంగన్‌వాడీ విభాగం ఎడ్లూరి సురేఖ, సోషల్ మీడియా నక్కల నాగరేణు, బూత్ కమిటీ విభాగం ఢాకా సుధాకర్ రెడ్డి, పబ్లిసిటీ విభాగం మండవ లక్ష్మీనారాయణ, వైఎస్సార్‌టీయూసీ కాకుమాను సునీల్‌లను నియమించినట్లు తెలిపారు.

మద్దిపాడు మండలం..

మద్దిపాడు: పార్టీ మండల నూతన అనుబంధ విభాగాల అధ్యక్షుల ఎంపిక చేసినట్లు మండల పార్టీ అధ్యక్షుడు మండవ అప్పారావు తెలిపారు. యూత్‌వింగ్ అధ్యక్షుడిగా మందా ప్రసాద్, మహిళా విభాగం కొత్తపల్లి సంధ్య, రైతు విభాగం మేకల క్రిష్టారెడ్డి, బీసీ సెల్ మద్దాలి లక్ష్మినారాయణ, ఎస్సీ సెల్ రాయపాటి విల్సన్, ఎస్టీ సెల్ జి హరిబాబు, మైనారిటీ సెల్ ఎస్‌కె దరేసా, స్టూడెంట్ వింగ్ చప్పిడి వెంకి, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రావూరి ప్రసన్నాంజనేయరెడ్డి, ఐటి వింగ్ మాలె శ్రీనివాసరెడ్డి, గ్రీవెన్స్ సెల్ కాకుమాను శశి, పంచాయతీ రాజ్ నార యసుబ్బారెడ్డి, వలంటీర్ విభాగం ఏ ప్రభుదాసు, అంగన్‌వాడీ విభాగం పీ నాగమల్లేశ్వరి, దివ్యాంగుల విభాగం జి సుబ్బారావు, కల్చరల్ కె ఏసుబాబు, వాణిజ్య విభాగం టి కోటిరెడ్డి, క్రిస్టియన్ మైనారిటీ సెల్ పీ శ్రీనివాసరావు, డ్రాక్టర్స్ వింగ్ పీ వెంకటేశ్వర్లు, సోషల్ మీడియా విభాగం ఏ పవన్, పబ్లిసిటి విభాగం జీ జాలయ్యలను నియమించినట్లు ఆయన తెలిపారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల నిరసన



పీహెచ్‌సీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీహెచ్‌ఓలు

సంతనూతలపాడు: చాలీచాలని వేతనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు (ఏపీఎంసీఏ) నిరసన తెలిపారు. గురువారం ఏపీఎంసీఏ ఆధ్వర్యంలో సంతనూతలపాడు పీహెచ్‌సీ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా పనిచేస్తున్నామన్నారు. గత రెండేళ్లుగా జీతభత్యాల విషయంలో తీవ్ర అన్యాయానికి గురయ్యామని, 2023లో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులందరికి 23% వేతన సవరణ ఇచ్చినప్పటికీ సీహెచ్వోలుగా పనిచేస్తున్నా వేతన సవరణలు చేయలేదన్నారు. ప్రతినెలా ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలు ఇవ్వకుండా తీవ్ర జాప్యం చేయడం వలన వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్‌హెచ్ ఉద్యోగులతో సమానంగా వేతన సవరణ, ప్రోత్సాహకాల క్రమబద్ధీకరణ, సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరసన అనంతరం వైద్యాధికారి హరిణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓలు ఏపీఎంసీఏ జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఎన్ జీవనజ్యోతి, బీ ఆదిత్య, ఏ శృతిలేఖ, ఎం అనూష, ఆర్ శ్రావ్యకళ్యాణి పాల్గొన్నారు.

నగరంలో డోర్ నంబర్‌లు వేయిస్తాం



రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమైన ఆర్‌డీఓ లక్ష్మీ ప్రసన్న

ఒంగోలు సబర్బన్: నగరంలో డోర్ నంబర్‌లు వేయిస్తామని ఒంగోలు ఆర్‌డీఓ లక్ష్మీ ప్రసన్న చెప్పారు. ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ రాజకీయ పార్టీ నాయకులతో ఆర్‌డీఓ గురువారం తన చాంబర్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకుడు దామరాజు క్రాంతికుమార్ మాట్లాడుతూ ఒంగోలు నగరంలో డోర్ నంబర్ల సమస్య ఉందని, నగరంలోని అన్ని డివిజన్‌లలో డోర్ నంబర్లు లేవన్నారు. కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారికి పెద్ద సమస్యగా ఉందని ఆర్‌డీఓ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే నగరంలో డోర్ నంబర్‌లు వేయించాలని కోరారు. చనిపోయిన వారి ఓట్లు వెంటనే తొలిగించాలని, నగరంలో కొన్ని పోలింగ్ స్టేషన్లు ప్రైవేటు స్కూళ్లలో ఉన్నాయని, తొలిగించాలని కొన్ని స్కూల్ యాజమాన్యాలు కోరుతున్నాయని ఆర్‌డీఓకు చెప్పారు. ఎన్నికల కమిషన్ అలోచించి వారిపైన చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌కు రిపోర్ట్ చేయాలని దామరాజు కోరారు. అనంతరం ఆర్‌డీఓ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం మీటింగ్ పెట్టామన్నారు. ఓటర్ల జాబితా ఎటువంటి తప్పులు లేకుండా సరిచేస్తామని, 18 సంవత్సరలు నిండిన వారు కొత్తగా ఓట్లు నమోదు చేసుకోవాలని కోరారు. చనిపోయిన వారి ఓట్లను తొలిగించాలని రాజకీయ పార్టీల నాయకులు అధికారులను కోరారు. పోలింగ్ బూతులలో సౌకర్యాలు, కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై దృష్టి పెట్టాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ ఆఫీస్ పరిపాలనాధికారి కృష్ణారావు, కొత్తపట్నం తహశీల్దార్ పిన్నిక మధుసూదన్, ఒంగోలు ఎంపీడీఓ రాజశేఖర్‌రావు, ఒంగోలు డీటీ సలోమితో పాటు, రాజకీయ పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

నక్షా సర్వేలో కచ్చితత్వం అవసరం



డీటీసీపీ డీడీ శ్రీనివాస్‌తో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: నక్షా సర్వేలో కచ్చితత్వం ఉండాలని మంగళగిరికి చెందిన డీటీసీపీ శ్రీనివాస్ చెప్పారు. నక్షా (నేషనల్ జియో స్పేసియల్ నాలెజ్‌–బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హ్యాబిటేషన్) సర్వే సందర్భంగా ఒంగోలులో గురువారం నగరపాలక సంస్థ వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీలకు, ఇతర సర్వే సంబంధిత సెక్రటరీలకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం క్విస్ కాలేజీలో జరిగింది. శిక్షణా కార్యక్రమంలో శ్రీనివాస్ మాట్లాడుతూ ఒంగోలు నగరంలో ఫిబ్రవరి 18 నుంచి నక్షా సర్వే ప్రారంభమైందన్నారు. అన్ని డివిజన్లలో 14 టీములుగా ఏర్పడి సర్వే చేస్తున్నారన్నారు. ఆ టీములపై ఐదుగురు సూపర్‌వైజర్ల ద్వారా 15 రోవర్లతో ప్రతి రోజు సర్వే చేస్తారన్నారు. సాఫ్ట్‌వేర్, అడ్వాన్స్ సర్వే మెథడాలజీ ద్వారా నగరంలోని గ్రౌండ్ ట్రూతింగ్ పద్ధతిపై ప్రతి ఇంటి కచ్చితత్వం కోసం లేటెస్ట్ టెక్నాలజీతో లీగల్ సమస్యలు లేకుండా సులభతరంగా భూ రికార్డులను ఆధునికీకరణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ ఆఫీసర్ ప్రవీణ్, వెంకటేశ్వర్లు, జీఐఎస్ టీమ్‌తో పాటు కమిషనర్ కే.వెంకటేశ్వర రావు, నగరపాలక సంస్థ, పట్టణ ప్రణాళికా విభాగపు ఏసీపీ జడ్ సుధాకర్, ఏసీపీ–2 శ్రీలక్ష్మీ, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ కె. బాబురావు, ప్లానింగ్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

జిల్లాకు అదనంగా నిధులు కేటాయించాలి



ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌ను కలిసిన జెడ్పీటీసీ రత్న భారతి

ఒంగోలు టౌన్: 15వ ఫైనాన్స్‌లో మిగిలిన రూ.109 కోట్ల నిధులను 16వ ఆర్థిక సంఘం నిధుల నుంచి విడుదల చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని నాగులుప్పలపాడు జెడ్పీటీసీ సభ్యురాలు యాదాల రత్నభారతి విజ్ఞప్తి చేశారు. గురువారం తిరుపతిలో జరిగిన 16వ ఫైనాన్స్ కమిషన్ సమావేశంలో ఆమె పాల్గొని ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ డాక్టర్ అరవింద్ పనగారియాకు విజ్ఞప్తి చేశారు. జిల్లాకు 2021–25లో 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి టైడ్ గ్రాంట్ 58, అన్‌టైడ్ గ్రాంట్ 44 మొత్తం 103 కోట్లు కేటాయించగా 212 కోట్లు ఖర్చుయిందన్నారు. ఫైనాన్స్ నిధుల ఖర్చులు పోగా మిగిలిన రూ.109 కోట్ల నిధులను 16వ ఆర్థిక సంఘం నిధుల నుంచి విడుదల చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పెరిగిన జనాభా ప్రకారం అదనంగా మరో రూ.100 కోట్లను కేటాయించాలని కోరారు. జిల్లాలో నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకోవాలని వివరించారు.

24న మండల సర్వసభ్య సమావేశం

నాగులుప్పలపాడు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 24న ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మహాలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు శాశ్వత ఆహ్వానితులతో పాటు అన్ని శాఖల అధికారులు తగు సమాచారంతో హాజరుకావాలని ఆమె కప్రకటనలో కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఒంగోలు సబర్బన్: నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ పరిసరాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఒంగోలు నగర విద్యుత్ శాఖ డీఈఈ కేవీ.పాండురంగారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బస్టాండ్‌తో పాటు ఊరచెరువు, సమైక్యతా నగర్, కొత్త కూరగాయల మార్కెట్, మఠం బజార్, బాలకృష్ణాపురం, కర్నూలు రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ మరమ్మతుల కారణంగా ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

పొగాకుకు గిట్టుబాటు ధర పెంచేందుకు కృషి



వేలం కేంద్రంలో పొగాకు పరిశీలిస్తున్న సూర్యకళ్యాణ్ చక్రవర్తి

ఒంగోలు సిటీ: విదేశాల్లో పొగాకు ఉత్పత్తి పెరిగినందున గిట్టుబాటు ధర పోయిన సంవత్సరం కన్నా కొంచెం తగ్గిందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి పేర్కొన్నారు. గురువారం ఒంగోలు సమీపంలోని త్రోవగుంటలోని పొగాకు వేలం కేంద్రం– 2ని ఆయన కూటమి నాయకులతో కలిసి సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోడీ పిలుపు మేరకు వికసిత్ భారత్‌లో భాగంగా అన్ని రంగాల ప్రజలను కలిసి వారికి ఉన్న ఇబ్బందులను తెలుసుకునే కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. పొగాకుకు ప్రస్తుతం ఉన్న గిట్టుబాటు ధర, వేలం జరుగుతున్న తీరు తదితర అంశాలను ఆయన పరిశీలించారు. అనంతరం పొగాకు రైతులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. పొగాకు వేలం కేంద్రం వద్ద చాలా మంది రైతులు వారి కష్టాలు, అవసరాలు, పంటనష్టాలు గురించి తెలియ చేస్తూ గతేడాది రూ. 300 ఉంటే ఈ సంవత్సరం రూ.280 వరకు మాత్రమే రేటు వచ్చిందని, పెట్టుబడి రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు పెరిగిందని రైతులు నాయకులకు తెలిపారు. పొగాకు వేలం కేంద్రం వైస్ చైర్మెన్ బోడపాటి బ్రహ్మయ్య, బోర్డు మెంబర్ పొద వరప్రసాద్, అధికారులతో మాట్లాడి వేలంలో రైతులకు గిట్టుబాటు ధర వచ్చేలా, రైతులు నష్ట పోకుండా అధికారులు ఒక నివేదికను రూపొందించి రైతులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు మెంబర్లు, పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు శివారెడ్డి, శివాజీ, పి.సుబ్బారావు, రాయపాటి అజయ్, దండు శ్రీనివాస్, అమరసింహ, రాధాకష్ణ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెళుకువలు పాటిస్తే వ్యాధులు దూరం



గొర్రెలకు టీకాలను పరిశీలిస్తున్న జేడీ బేబిరాణి

నాగులుప్పలపాడు: వేసవిలో పశుపోషకులు మెళుకువలు పాటించాలని పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకురాలు డాక్టర్ కే బేబి రాణి పేర్కొన్నారు. గురువారం మండలంలోని నిడమానూరు, పోతవరం గ్రామాల్లో పశపోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా బేబిరాణి మాట్లాడుతూ వేసవిలో ఎప్పటికప్పుడు పశువులపై తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. పశువుల దాహార్తి తీర్చేందుకు ఉపాధి పనులతో నీటి తొట్టెల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపామన్నారు. గడ్డి జొన్నలు 75 శాతం సబ్సిడీపై పశువైద్యశాలలో అందజేస్తున్నట్లు తెలిపారు. అదే విదంగా 80 శాతం సబ్సిడీపై పశుబీమా పథకాన్ని రైతులకు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది హనుమంతరావు, లావణ్య, కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చెత్తసంపద తయారీతో ఉపయోగాలు



చెత్త సంపద తయారీ కేంద్రాల గురించి మాట్లాడుతున్న విజయశేఖర్

కొత్తపట్నం: చెత్త పంపద తయారీ కేంద్రాల వలన గ్రామాలు శుభ్రంగా ఉండటమే కాక ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఫైనాన్స్ మేనేజర్ పి.విజయ శేఖర్ అన్నారు. మండలంలోని కె.పల్లెపాలెంలో ఉన్న చెత్త సంపద తయారీ కేంద్రాన్ని విజయవాడ నుంచి వచ్చిన విజయ శేఖర్, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బీ సాయికృష్ణ గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తడిచెత్త, పొడి చెత్త వేరు చేసి తయారీ కేంద్రాలకు తరలించి కంపోస్టు ఎరువులు తయారు చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ విశ్వనాథపల్లి ఆనంద్‌రావు, ఒంగోలు డివిజన్ డీఎల్‌పీవో ఆర్ పద్మ, ఎంపీటీసీ సభ్యుడు పిన్ని నరసింహారావు ఉప సర్పంచ్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో శ్రీకృష్ణ, డిప్యూటీ ఎంపీడీవో బాల చెన్నయ్య, పాల్గొన్నారు.

రైజ్‌లో ప్రాంగణ ఎంపికలు



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

ఒంగోలు సిటీ: ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని రైజ్ కళాశాల సెక్రటరీ శిద్దా హనుమంతరావు పేర్కొన్నారు. గురువారం వల్లూరు సమీపంలోని రైజ్ కృష్ణసాయి గ్రూప్ అఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో అపిత, రైజ్, ఏఆర్‌ఎంఎస్ సంయుక్తంగా కియా కంపెనీ ప్రాంగణ ఎంపికలను నిర్వహించారు. ప్రాంగణ ఎంపికలకు ఏఆర్‌ఎంఎస్ తరుపున హెచ్‌ఆర్ వెంకటేష్, మనీష్, అపిత తరుపున సత్య రత్నం, జనార్దనరావు, మోహన్‌కృష్ణ బృందం పాల్గొన్నారు. కళాశాలలో 170 మంది విద్యార్థులకు రాత పరీక్ష, టెక్నికల్ రౌండ్ నిర్వహించారు. ఈ రౌండ్‌లలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేసి ఫైనల్‌గా కియా మోటార్స్ కంపెనీ హెచ్ ఆర్ ఉమాశంకర్ ఆన్‌లైన్ ద్వారా 48 మందిని తుది జాబితాగా ఖరారు చేశారు. ఇందులో 42 మంది రైజ్ కళాశాల విద్యార్థులు, ఆరుగురు ఇతర కళాశాల విద్యార్థులు ఉన్నారని కళాశాల డైరెక్టర్ డాక్టర్ భాస్కర్ రావు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు కియా ప్లాంట్ అనంతపూర్‌లో ట్రైనీగా తమ విధులను నిర్వహిస్తారని, వారికి వార్షిక వేతనం రూ.2.60 లక్షలు ఉంటుందని కళాశాల ప్లేసిమెంట్ ఆఫీసర్ రఘుబాబు తెలిపారు. ఈసందర్భంగా ఎంపికైన విద్యార్థులను కళాశాల గౌరవ చైర్మన్ ఇస్కాల రంగమన్నార్, రాగా చీఫ్ అడ్వైజర్ శిద్దా ప్రవల్లిక, ట్రైనర్లు అభినందించారు.

పట్టాభిషేక ఉత్సవంలో కోదండ రాముడు

ఒంగోలు మెట్రో: నయన మనోహరంగా కోదండ రాముడికి పట్టాభిషేకం నిర్వహించారు. గురువారం ఒంగోలు మండలంలోని వలేటివారిపాలెం రామక్షేత్రంలో సీత లక్ష్మణ హనుమత్ సమేత కోదండ రామస్వామి ఆలయంలో తొమ్మిదో వార్షిక కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు వైఖానస భగవత్ శాస్త్రానుసారంగా పూజాక్రతులను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాత్రికి మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామి వారి గ్రామోత్సవం కన్నుల పండవగా నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.



పట్టాభిషేక మహోత్సవంలో కోదండ రాముడు

నగరంలో పోలీసుల విస్తృత తనిఖీలు



ద్విచక్రవాహనదారుల పత్రాలను పరిశీలిస్తున్న పోలీసులు

ఒంగోలు టౌన్: జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంలో గురువారం రాత్రి పోలీసులు పోలీసులు తనిఖీ నిర్వహించారు. శాంతి భద్రతలలో భాగంగా నగరంలోని వన్ టౌన్, టూ టౌన్, తాలూకా పోలీసు స్టేషన్ల పరిధిలోని పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనదారుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కే. నాగేశ్వర రావు పర్యవేక్షించారు. సీఐలు, ఎస్సైలు, ట్రాఫిక్ పోలీసులు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం

ఒంగోలు టౌన్: ఏదైనా కళాశాల, షాపింగ్ మాళ్లలో పొరపాటున అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ఆందోళన చెందకుండా తగిన జాగ్రతలు తీసుకోవాలని జిల్లా అగ్నిమాపక అధికారి కే శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం నగరంలోని ఒక ప్రైవేటు పాఠశాలలోని విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ప్రథమ చికిత్స గురించి వివరించారు. వేసవిలో గృహాల్లో జరిగే అగ్ని ప్రమాదాలు, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగినప్పుడు ప్రథమ దశలో తీసుకోవాల్సిన జాగ్రతలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా సహాయక అగ్నిమాపక అధికారి శ్రీనివాసుల రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

సంతనూతలపాడు: సబ్సిడీతో కూడిన ఎస్సీ కార్పొరేషన్ రుణాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సంతనూతలపాడు ఎంపీడీవో డీ సురేష్ బాబు గురువారం ఒక ప్రకటనలో కోరారు. 21 సంవత్సరాల నుంచి 50 ఏళ్ల లోపు గల ఎస్సీలు ఇందుకు అర్హులన్నారు. మే 13వ తేదీ లోపు సచివాలయాలు, ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా దరఖాస్తులు నమోదు చేసుకోవాలన్నారు. 2025–26 వార్షిక సంవత్సరానికి సంబంధించి ఎస్సీ కార్పొరేషన్‌కు చెందిన సబ్సిడీ పథకాలకు లబ్దిదారులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. త్వరలో మండలానికి సంబంధించిన వివరాలు ఇవ్వనున్నారని ఆయన ప్రకటనలో తెలిపారు.